క్లుప్తంగా

సాగు ఖర్చులు తగ్గించుకోవాలి

వీరపునాయునిపల్లె : మట్టి నమూనాల ఆధారంగా ఎరువులు వాడి సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్యామ్ బాబు తెలిపారు. శనివారం మండలంలోని ఇందుకూరు రైతు సేవా కేంద్రం సిబ్బంది చేపడుతున్న మట్టి నమూనా పరిక్షలను ఆయన పరిశీలించి మాట్లాడారు. 2025 సంవత్సరానికి గాను 924 నమూనాలను లక్ష్యంగా నిర్దేశించారని రైతు సేవాకేంద్రాల సిబ్బంది ద్వారా మట్టి నమూనాలను సేకనరించి భూసార పరిక్ష కేంద్రానికి పంపాలని తెలిపారు. అవసరం మేరకు రసాయన ఎరువులు వాడి సాగు ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చని ఈ విషయాన్ని రైతులు గమనించాలన్నారు. ప్రతి రైతు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి మట్టి నమూనాలను సేకరించి పరిక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

చక్రాయపేట : గ్రామీణ ప్రాంత ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దారు విజయకుమారి తెలిపారు. శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులతో కలసి సర్పంచ్ హర్షాద్ అయ్యూబ్ బాషా, ఎంపీడీవో కుళాయమ్మ, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ నాయక్, కేజీబీవీ ప్రిన్సిపాల్ గౌస్ప్యారీ, ఆర్‌పీ రాజవర్ధిని, చివాలయ సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం చక్రాయపేటలో చలివేంద్రంను ప్రారంభించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు గౌస్‌లాదం, గౌస, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

వేంపల్లె : హైస్కూల్ ప్లస్ లో 2025-26 విద్య సంవత్సరానికి ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభించినట్లు హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం శ్రీనివాసులు తెలిపారు. శనివారం వేంపల్లెలోని స్థానిక క్రిస్టియన్ కాలనీ, తదితర ప్రాంతాల్లో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇంటి వద్దకు హైస్కూల్ ప్లస్ అధ్యాపకులు వెళ్లి ప్రభుత్వ ఇంటర్ బాలికల కళాశాలలో చేరాలని కోరారు. అలాగే కళాశాలలో చేరిన విద్యార్థులకు అడ్మిషన్లు కార్డులను హెచ్‌ఎం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్ కళాశాలలో బాలికలకు విద్యాపరంగా ఆధునిక సౌకర్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని, ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా విద్యా బోధన, ఉచిత స్టడీ మెటీరియల్, ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్‌ను పెట్టి మంచి ఫలితాలను సాధిస్తామన్నారు. ఈ ఏడాది కూడా ఇంటర్‌లో అధిక శాతం ఉత్తీర్ణత సాధించిన కళాశాలగా పేరు గాంచిందన్నారు. కార్యక్రమంలో పీజీటీ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇ-వేస్ట్‌పై ప్రత్యేక శ్రద్ధ ఉండాలి

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : మున్సిపల్ పరిధిలో ఇ-వేస్ట్(ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) వదిలించుకోవడంపై ప్రజలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. శనివారం పట్టణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇ-వేస్ట్ కార్యక్రమాన్ని సరిగ్గా నిర్వహించకపోతే పర్యావరణానికి తీవ్రనష్టం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వుంటే వెంటనే వాటిని మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మెప్మా టీఎంసీ నాగేంద్ర, సచివాలయ, శానిటేషన్, సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పని సరి

వేంపల్లె : ప్రభుత్వ ఉద్యోగం విధుల్లో చేరినప్పటి నుండి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ అనేది తప్పనిసరి అని ఎంఇఓ-2 స్టాలిన్ ఐజాక్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ ఆవరణలో ఎంఈఓ జాఫర్ సాదిక్ పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఇఓ జాఫర్ సాదిక్ దంపతులను ఆయా ఉపాధ్యాయ సంఘాలు, ఎంఆర్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు సత్కరించారు.

క్షేత్ర స్థాయిలో నిఘా ఉంచాలి

ముద్దనూరు : క్షేత్రస్థాయిలో పోలీసులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ ప్రత్యేక నిఘా ఉంచాలని డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం రాత్రి ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు అధికారులతో మాట్లాడుతూ దొంగతనాలు, మట్కా, జూదం తదితర అసాంఘిక కార్యక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు కేసులను పరిష్కరించాలని తెలిపారు. రికార్డులను డీఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక సీఐ దస్తగిరి, ఎర్రగుంట్ల సీఐ నరేష్‌బాబు, ఎస్ఐ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పాలీసెట్ నమూనా పరీక్షలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక రమణప్ప సత్రంబడి పాఠశాలలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి, ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో మాక్ పాలీసెట్ (నమూనా పరీక్షలు) ప్రారంభం చేశారు. ఈనెల 25న ఏపీ ఆర్‌జేసీ, ఈనెల 30న పాలీసెట్ ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రవేశాలకు ప్రణాళిక ప్రకారం ఉచిత కోచింగ్ సెంటర్‌లో శనివారం మాక్ పాలీసెట్ పరీక్షలు మొదలు పెట్టారు. ఈనెల 28 వరకు ప్రతిరోజూ నమూనా పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన అరటి చెట్లు
- రూ.2 కోట్ల మేర పంట నష్టం
- పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారులు


దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

వేముల : వేముల మండలంలో శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో వందల ఎకరాల్లో అరటి తోటలు నేలకూలాయి. సుమారు రూ.2 కోట్లకు పైగా పంట నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న అరటి తోటలను ఉద్యాన శాఖాధికారులు శనివారం పరిశీలించారు. ఎంతో ఆశతో అరటి సాగు చేసుకున్న రైతులు ప్రకృతి ప్రకోపానికి బలయ్యారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు.. గాలివానకు తీవ్రంగా నష్టపోయారు. చేతికి అందివచ్చిన అరటి పంట దెబ్బతినడంతో వారు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. మరోవారం, పది రోజుల్లో తోటల్లో అరటి గెలలు కోయాల్సి ఉండగా, నేలకు వాలిపోవడంతో జీర్ణించుకోలేకపోతున్నారు. ఎంతో ఆశాజనకంగా ఉన్న అరటి తోటలు రాత్రికి రాత్రే నేలకూలడంతో రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. సాగులో పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని వారు ఆవేదన చెందుతున్నారు. అరటి సాగు చేస్తే ఆదాయం ఉంటుందనే ఉద్దేశంతో రైతులు కష్టనష్టాలను భరించి సాగు చేసుకున్నారు. అరటి తోటలను చూసిన రైతులు ఈ ఏడాది అరటిలో సాగు చేసిన అప్పులు తీరిపోయి ఆదాయం ఉంటుందని ఆశించారు. అయితే రైతుల ఆశలు తలకిందులయ్యాయి.

214 హెక్టార్లలో నేలవాలిన అరటి

గాలివాన బీభత్సానికి మండలంలో 214 హెక్టార్లలో అరటి తోటలు నేలకూలినట్లు ఉద్యాన శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వర్షాలతో దెబ్బతిన్న అరటి తోటలను ఉద్యాన శాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. గాలివానకు 214 హెక్టార్లలో అరటి తోటలు నేలకూలినట్లు ప్రాథమిక అంచనా వేశామని హెచ్ఓ తెలిపారు. మండలంలోని వేముల, వేల్పుల, గొందిపల్లె, మబ్బుచింతలపల్లె, మీదిపెంట్ల గ్రామాల్లో గాలి వానకు అరటి తోటలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. గాలివానతో దెబ్బతిన్న అరటి తోటలను పూర్తిస్థాయిలో పరిశీలించి నష్టం అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని ఆయన తెలిపారు.

కోలుకోలేని దెబ్బ

వేముల మండలంలో గాలివానకు దెబ్బతిన్న అరటి తోటలకు రూ.2 కోట్ల మేర నష్టం వాటిల్లింది. సాగులో ఎకరాకు లక్ష రూపాయలకు పైనే పెట్టుబడులు పెట్టారు. గెలలు కోతకు వచ్చిన సమయంలో గాలివానతో అరటి తోటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నేలకూలిన అరటి గెలలను వ్యాపారులు కొనుగోలు చేయరని, వాటిని వదులుకోవాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. ధరలు ఉన్న సమయంలో అరటి తోటలు గాలివానకు పడిపోవడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది.

ఈదురు గాలులకు అరటి, బొప్పాయి పంటలు ధ్వంసం

లింగాల : మండలంలోని కర్ణపాపాయపల్లె, వెలిదండ్ల గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వీచిన బలమైన ఈదురు గాలులు, వర్షానికి అరటి, బొప్పాయి పంటలు ధ్వంసమయ్యాయి. మూడు వారాల క్రితం తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల, ఎగువపల్లె గ్రామాల్లో అరటి పంట నేలకూలగా, గత సోమవారం లింగాల, చిన్నకుడాల, పెద్దకుడాల, రామట్లపల్లె, గుణకణపల్లె, లోపట్నూతల గ్రామాల్లో అరటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మళ్లీ శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులవల్ల కర్ణపాపాయపల్లె, వెలిదండ్ల గ్రామాల్లో 120 ఎకరాలలో అరటి పంట, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రూ.1.20 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఉద్యాన శాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి తెలిపారు. రైతు సేవా కేంద్ర అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పంట నష్టం అంచనాలను వేసి ప్రభుత్వానికి నివేదికలు అందిస్తున్నారు. కర్ణపాపాయపల్లె గ్రామంలో అంకాల్‌రెడ్డి అనే రైతుకు చెందిన సుమారు 2 ఎకరాలలో అరటి పంట పూర్తిగా దెబ్బతింది. సూర్యప్రతాప్‌రెడ్డికి చెందిన బొప్పాయి పంట గాలికి విరిగి పడిపోయింది. కోతకు వచ్చే సమయంలో ఇలా ఈదురు గాలులకు పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


లింగాల : అంకాల్‌రెడ్డి పొలంలో నేలకూలిన అరటి పంట


సింహాద్రిపురం : అరటి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి


నేలకొరిగిన అరటి పంట

ఈదురు గాలుల దెబ్బ

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మ గూడూరు, కోవరంగుంటపల్లె, బిదినంచర్ల, కసనూరు తదితర గ్రామాల్లోని అరటి చెట్లు గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు నేలకొరిగాయి. హిమకుంట్ల గ్రామంలో ఒకే రైతుకు చెందిన 5 ఎకరాల మొక్కజొన్న పంట నేలకు వాలింది. నేలపాలైన అరటి తోటలను సంబంధిత అధికారులు పరిశీలించారు. నష్టపోయిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

గాలులకు దెబ్బతిన్న వినాయక విగ్రహాలు



జమ్మలమడుగు రూరల్ : పట్టణంలో వీచిన గాలులకు వినాయక విగ్రహాలు దెబ్బతిన్నాయి. ప్రతి ఏడాది ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న దుత్తలూర్ గ్రామంలో వినాయక విగ్రహాలు తయారు చేసి విక్రయిస్తారు. శుక్రవారం వీచిన గాలులకు విగ్రహాల అచ్చులు, కొన్ని వినాయక విగ్రహాలతో పాటు పైపులతో వేసిన గుడారం నెలకొరిగింది. దీంతో సుమారు రూ.5 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు గురుశేఖరు ఆవేదన వ్యక్తం చేశాడు. తమ లాంటి నిరుపేదలను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వాపోయాడు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


అధికారులతో చర్చిస్తున్న జడ్జి

జమ్మలమడుగు రూరల్ : మే 10వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. శనివారం కోర్టు చాంబర్‌లో పోలీసు అధికారులు, న్యాయవాదులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. చిన్న చిన్న కేసుల వల్ల కక్షిదారులు స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తుందన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించండి

- గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన
- అధ్వానంగా తయారైన డ్రైనేజీ పారిశుద్ధ్య వ్యవస్థలు


గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వేంపల్లె : కూటమి ప్రభుత్వ అసమర్థత పాలనతో గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేదని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్రఓబుల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మునీర్, రవిశంకర్‌గౌడ్‌లు తెలిపారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు కూటమి ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో డ్రైనేజీ, పారిశుద్ధ్య వ్యవస్థలు అస్తవ్యస్తంగా తయారయ్యాయన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవో వెంకటసుబ్బారెడ్డి, ఇద్దరు సిబ్బందిని రెండు నెలల క్రితం సస్పెండ్ చేశారు. అప్పటినుంచి గ్రామ సచివాలయ ఉద్యోగులకు, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించడం లేదన్నారు. జీతాలు చెల్లించకపోవడంతో పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోవడంలేదన్నారు. జిల్లాలోని మేజర్ పంచాయతీ అయిన వేంపల్లెలో ఇప్పటివరకు ఈవోను నియమించకుండా గ్రామపంచాయతీని భ్రష్టు పట్టించారని, ఎక్కడ చూసినా చెత్తాచెదారాలతో నిండి ఉన్నాయన్నారు. శుక్రవారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి డ్రైనేజీలో చెత్తాచెదారాలు పెరిగిపోయి రోడ్లపై మురుగునీరు పారుతోందన్నారు. ఇంత జరుగుతున్నా ఇన్‌చార్జిగా ఉన్న డీఎల్‌పీఓ రమాదేవి, ఉన్నతాధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కొత్త ఈఓను నియమించి, పారిశుద్ధ్య కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేంపల్లె మండలంలో రూ.600 కోట్ల నిధులు ఇచ్చి అభివృద్ధి జరిగిందని, అయితే ఒకటి, రెండు నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. దీంతో మొత్తం వైఎస్సార్‌సీపీవల్ల నిర్మాణ పనులు కుంటుపడ్డాయని కూటమి నేతలు గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. రైతు బజార్, ఆర్టీసీ బస్టాండ్, పాపాగ్ని నదిలో హై లెవెల్ వంతెనలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే 90 శాతం పూర్తయ్యాయని, ఆ తర్వాత ఎన్నికల రావడంతో వాటి నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. కూటమి నేతలు 10 శాతం పూర్తి పనులు చేసినా కూడా కూటమి నేతల ఆధిపత్య పోరుతో ప్రారంభానికి నోచుకునే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి లబ్ధిదారుడికి రేషన్ అందివ్వాలి


రేషన్ షాపును పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య

వేంపల్లె : ప్రతి లబ్ధిదారుడికి డీలర్లు రేషన్ అందివ్వాలని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. శనివారం వేంపల్లెలోని చింతలమడుగుపల్లె, కాలేజీ రోడ్డులో ఉన్న రేషన్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాకు వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా కార్డుదారులకు రేషన్ అందలేదని ఫిర్యాదులు అందితే అలాంటి డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముందుగా గ్రామస్తులకు ఆయా రేషన్ షాపుల్లో రేషన్ బియ్యం సరఫరా చేయాలన్నారు. ఇతర మండలాల్లో ఉన్న ప్రజలకు ముందుగా ఇవ్వరాదని, బ్లాక్ లిస్ట్‌లో ఉన్న బియ్యాన్ని వారికి పంపిణీ చేయాలన్నారు. ఇతర గ్రామాల్లో, మండలాల్లో ఉన్న వారికి బియ్యం పంపిణీ చేయడం వలన ఆయా రేషన్ షాపుల పరిధిలో ఉన్న వారికి బియ్యం పంపిణీ కావడంలేదని లబ్ధిదారుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ముందుగా ఆయా రేషన్ షాపుల పరిధిలో ఉన్న కార్డుదారులకు బియ్యం పంపిణీలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు డీలర్‌షిప్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆర్ఐ లోకేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై వైద్య సిబ్బందికి అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖాధికారి సునీల్‌కుమార్


కమలాపురంలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారులు

పులివెందుల రూరల్ : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని పార్నపల్లి రోడ్డు శ్రీసిరి ఆసుపత్రిలో వైద్యులకు, వైద్య సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ సునీల్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా మంటలను ఆర్పాలనే దానిపైన డెమో ద్వారా చూపించారు. అధికారులు చెప్పే సూచనలు, సలహాలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

వేంపల్లె : అగ్ని ప్రమాదాలపై అవగాహన ఎంతో అవసరమని అగ్నిమాపక శాఖ అధికారి బి.శివరామిరెడ్డి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం డాక్టర్ ఎస్.ఎఫ్. బాషా హాస్పిటల్‌లో సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. హాస్పిటల్‌లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మెన్లు వెంకటసుబ్బయ్య, మహమ్మద్ సాలార్, ఫైర్ మెన్లు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ

కమలాపురం : అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తగిన జాగ్రత్తలను తీసుకోవడం వలన రక్షణ పొందవచ్చునని కమలాపురం అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి ఆఫీసర్ ఏ జనార్దన్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శనివారం కమలాపురం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో కమలాపురం పట్టణంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందితో బాటు ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అగ్నిప్రమాదాల గురించి, వాటి నుండి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణరాలు డాక్టర్ నిహారిక క్యాన్సర్ అవగాహన, క్యాన్సర్ స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులను క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు అందుబాటులో ఉంటాయన్నారు. నరాలు, గుండె జబ్బుల, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర ర్యాలీ

ముద్దనూరు : మండలంలోని పలు పంచాయతీ కేంద్రాల్లో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పలూరులో ఎంపీడీఓ ముకుందరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రేణుక, సర్పంచ్ గంగయ్య, ఇతర అధికారులు విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక మేజర్ పంచాయతీ ముద్దనూరులో ఈఓపీఆర్డీ వీరభద్రుడు, ఎస్‌హెచ్‌జీ మహిళలతో కలసి ర్యాలీ, మానవ హారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

లింగాలలో..

లింగాల : ఎగువలింగాల జిల్లా పరిషత్ హైస్కూలులో శనివారం మండలస్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో, ఇళ్లలో ఉపయోగం లేని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను జాగ్రత్తగా తొలగించాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, ఏఓ లోకేశ్వరరావు, ఎంఈఓ రామకృష్ణయ్య, పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెసు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సులోచనమ్మ

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సులోచనమ్మను నియమించినట్లు ఏపీపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ప్రకటించారని సులోచనమ్మ శనివారం తెలిపారు.

భూసార పరీక్షలతో రైతులకు లబ్ధి

ముద్దనూరు : ప్రతి రైతు తమ పొలంలో భూసార పరీక్షలు చేయించుకోవాలని దీని వల్ల రైతులు లబ్ధి పొందవచ్చునని ఏడీఏ వెంకటసుబ్బయ్య, ఏఓ వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని శెట్టివారిపల్లెలో పొలాల్లో రైతుల వద్ద నుంచి మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వ్యవసాయ సీజన్‌లో మండలంలో మొత్తం 690 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు, ఒక్కో రైతు సేవా కేంద్రం నుంచి 69 మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు చేయించనున్నట్లు వారు తెలిపారు. దీని వల్ల పొలాల్లో పోషక విలువలను బట్టి ఎరువులను వాడి అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

పిల్లలకు వ్యాధులు రాకుండా నిరోధిస్తుంది

చింతకొమ్మదిన్నె : సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు కొత్తపల్లెపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఒక బృహత్తరమైనదని దీని ద్వారా 11 ప్రాణాంతక వ్యాధులు రాకుండా బిడ్డలను కాపాడుతుందని ఆరోగ్య కార్యకర్తల నుండి వ్యాధినిరోధక టీకాలను పొందాలని ఆయన తెలియజేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు రాఘవేంద్ర, జిల్లా ఎపిడమియాలజిస్టు ఖాజా, ఆరోగ్య పర్యవేక్షకులు జనార్దన్, అంగన్‌వాడీ పర్యవేక్షకులు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం


పూలంగళ్ల సర్కిల్ వద్ద స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, తదితరులు

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ తెలిపారు. శనివారం స్థానిక పూలంగళ్ల సర్కిల్ వద్ద స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో ఈ-చెక్ ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నియంత్రించండి - శాస్త్రీయంగా వదిలించండి అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం పూలంగళ్ల సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. అక్కడ నుంచి స్వచ్ఛాంధ్ర ర్యాలీని ప్రారంభించి పార్నపల్లె రోడ్డు మీదుగా ప్రకృతి రెస్టారెంట్ వరకు సాగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిశోర్, నాయకులు కోడి రమణ, ఖాదర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాలలో..

పట్టణంలోని స్థానిక ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇ-వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతులలో రీసైకిల్ చేయటం' అనే అంశం మీద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జయమ్మ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

భూసారపరీక్షలు తప్పనిసరిగా చేయాలి


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఓ

కొండాపురం : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే రైతులకు ముందుగానే పొలాల్లో భూసార పరీక్షలు తప్పకుండా చేయాలని మండల వ్యవసాయ అధికారి ఏవీ రామంజుల్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని రైతుబరోసా కేంద్రంలో వ్యవసాయ గ్రామ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. పొలాల్లో పోషకాల పరిమాణం, నత్రజని, లవణ సాంద్రత, సేంద్రియ కార్బనం మొదలకు పోషకాలు ఎంత పరిమాణంలో ఉన్నాయో వాటి కోసం మట్టి నమూనాలు తీసుకొని ల్యాబ్ పంపించాలన్నారు. రైతులకు అవగాహన కల్పించి భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకునేలా సూచించాలన్నారు. మట్టి నమూనాలో రిపోర్టు వచ్చిన తర్వాత ఏ యే మోతాదులో ఎరువులు వాడుకోవాలో వివరిస్తే మంచి దిగుబడి వస్తుందన్నారు. రాష్ట్ర పౌరసరఫరా సంస్థ ద్వారా జొన్నలు క్వింటాల్ ధర రూ.3371 మద్దతు ధర ప్రభుత్వం కల్పించి కొనుగోలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎఈఓ రమేష్, వ్యవసాయ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ ఎస్కె రోషన్

కమలాపురం : దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కమలాపురం సీఐ ఎస్కె రోషన్, ఎస్ఐ విద్యాసాగర్‌లు సూచించారు. కమలాపురం పట్టణంలో శనివారం వారు సిబ్బందితో కలిసి ప్రజలకు పలు సూచనలు చేస్తూ ఆటో ద్వారా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ మధ్యకాలంలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో తాళాలు వేసిన ఇళ్లలో, బహిరంగ ప్రదేశాల్లో మహిళల వద్ద ఉన్న బంగారాన్ని ఎక్కువగా దొంగలు దోచుకెళ్లారని తెలిపారు. ప్రజలు తమ ఇళ్లల్లో బంగారు, డబ్బు, ఇతర విలువైన వస్తువులను ఉంచకుండా, లాకర్లలో దాచుకోవాలని సూచించారు. మహిళలు బయటికి వెళ్లే సమయంలో బయటికి కనపడకుండా బంగారును ధరించాలని సూచించారు. వేసవికాలంలో ఇంటిపైన నిద్రించేవారు తప్పనిసరిగా ఇంటికి తాళాలు వేయాలనీ, వీలైనంతవరకు ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మీ ప్రాంతాలలో ఎవరైనా అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తాం

సింహాద్రిపురం : మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని ఎస్ఐ రవికుమార్ హెచ్చరించారు. శనివారం సింహాద్రిపురంలో ఆయన వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, మొదటిసారి పట్టుపడితే జరిమానాలు విధిస్తామని, రెండవసారి పట్టుబడితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. మండలంలో ఎక్కడన్నా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తెలపాలని, తెలిపిన వారి పేర్లను గోపంగా ఉంచుతామన్నారు. అనంతరం పలు వాహనాలకు పత్రాలులేని వాటికి, లైసెన్సులు లేని వారికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలపై అవగాహన కలిగి ఉండాలి

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారంగా 'స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈ-వ్యర్థాల పట్ల అవగాహన కలిగి ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ వివేకానంద డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ-వ్యర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను పడేయకుండా రీసైక్లింగ్ చేయడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ఆదాయ వనరులుగా మార్చుకోవచ్చునన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్ నాగేంద్ర, సిబ్బంది, పాల్గొన్నారు.

వేడుకలకు సిద్ధమవుతున్న జెడ్పీ పాఠశాల

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : ఎర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల స్థాపించి 75 సంవత్సరాలు కావడంతో వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, వృత్తి విద్యా ఉపాధ్యాయులు చంద్రఓబుళరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రహారీ గోడపై దేశ నాయకులు, సంఘ సంస్కర్తలు, శాస్త్రవేత్తల చిత్రాలను గీయిస్తున్నామన్నారు. దాతల సహకారంతోనే పాఠశాలను అని విధాలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. వేడుకలు నిర్వహించడానికి పూర్వ విద్యార్థులు, దాతలు, సహాయ సహకారాలు అందించాలని కోరారు.